# ఆత్మహత్య

## — రావి కొండలరావు

**వెంకట సుబ్బారావు ఉరితాడు కోసం ఊరంతా తిరిగాడు. ఎక్కడా సరైనదీ, అనువైనదీ దొరకలేదు. అప్పటికీ ఓ కొట్టు వాడిని, వాడు ఆశ్చర్యపడి మూర్ఛపోయేలా, "ఉరితాళ్లు మంచివి వున్నాయా?" అని కూడా అడిగాడు. కొట్టువాడి భయం చూసి, వెంకట సుబ్బారావు మరింత భయపడి పారిపోయాడు. ఎలాగైనా తను ఈ రాత్రిలోగా చచ్చి తీరాలి. 'ఎన్ని ఆటంకాలొచ్చినా చస్తాను- పందెం!' అనుకున్నాడు.**

కాని, తనకు నచ్చిన ఉరితాడు కోసం వెతకడంతోనే సరిపోయింది పొద్దుట్నుంచీ. ఇంకెలా! బతకడానికి మార్గాలు తక్కువే అయినా, చావడానికి మాత్రం బోలెడన్ని. కారు కిందో, రైలు కిందో పడొచ్చు, నూతిలోనో, నదిలోనో దూకవచ్చు. నిద్ర మాత్రలు మింగొచ్చు, విషం తాగొచ్చు; విద్యుచ్ఛక్తికి చూపుడు వేలు తాకించ వచ్చు! అంచేత వీటిలో ఏదో ఒకటి చెయ్యలేక పోతానా, చావకపోతానా అని వెంకట సుబ్బారావు గట్టిగా నమ్మాడు. రోడ్డు పక్క నుంచి స్పీడుగా వెళ్తున్న కార్లని లెక్క బెట్టుకున్నాడు. గభాలున వెళ్లి ఒక కారు కింద పడితే? ఏమో- ఆ డ్రైవరు దౌర్భాగ్యుడు చటుక్కున బ్రేకు నొక్కి కారు పక్కకి తిప్పేస్తే?... అనవసరంగా బతికిపోతాడు తను.

తీరా బతికాక ఈ జనం, పోలీసులు, న్యాయాధికారులు అంతా కలిసి తనని బతకనివ్వరు! పర్వతాకారంలో కదిలి వస్తున్న లారీ అయితే?... అమ్మో! మరీ బరువు! రైలు పర్వాలేదేమోగాని, పట్టాల మీద చాలా దూరం నడిచి పోవాలి. నూతిలోగాని, నదిలోగాని దూకితే?- దూకవచ్చు గాని, ఏ సన్నాసిగాడో చూసి, కేకలు పెట్టి జనాన్ని తీసుకొచ్చి తనని కాపాడతాడు! వీళ్ళ దుంప తెగ- ఈ మనుషులకి వేరే ఏం పనుండదు-

'ఎవడెలా పోతే మన కెందుకులే' అని వూరుకోవచ్చుగా- వూరుకోరు! ఏమైనా, రాత్రిలోగా తను చావడం ఖాయం. ఎలా, ఏ విధానాన్ని నమ్ముకుని చావాలన్నది తీవ్రమైన తర్జన భర్జనలో వుంది!...

ఇంతకీ ఈ వెంకటసుబ్బారావు చావు ఆలోచనకి కారణం ఏమిటీ!-

ఉంది.

అతనొక అమ్మాయిని ప్రేమించాడు. అలా ఇలా కాదు, గాఢంగా, అమిత గాఢంగా ప్రేమించాడు.

తొలిసారి, ఆ అమ్మాయిని బస్సుస్టాపు దగ్గర్లో వున్న ఐస్‌క్రీమ్ షాపులో చూసి మూర్ఛిల్లి, కళ్ళు తెరిచి ఆ తొలి చూపులోనే వలచాడు. వలచి, వెంటబడ్డాడు. వెంటబడి, ఆమె కంట పడ్డాడు... పడీ పడ్డంతోనే చిరునవ్వునవ్వాడు... సకిలించాడు... ఇకిలించాడు... చొక్కా కాలరు సర్దాడు... గుండీలు తిప్పాడు... గుండెలు నిమిరాడు... ఐతే ఆ చేష్టలకి ఆ అమ్మాయేం పట్టించుకోలేదని వెంకట సుబ్బారావు వూరుకోలేదు. తను మాత్రం గట్టిగా పట్టించుకున్నాడు. ఇల్లు తెలుసుకున్నాడు. ఇంటి పనిమనిషికి లంచాలు పెట్టి, ఆ అమ్మాయి పేరూ అవీ తెలుసుకున్నాడు.

అమ్మాయి పేరు సుధారాణి. 'సుధ' అని ఇంట్లో పిలుస్తారు. కాలేజీలో ఏదో చదువుతూ మానేసింది. పెళ్లి చెయ్యాలని తల్లిదండ్రులు ప్రయత్నాలు చేస్తున్నారు. వాళ్లకి ఆమె ఒక్కతే కూతురు. కులం పట్టింపు వున్నట్టు లేదు. అబ్బాయి ఉద్యోగస్థుడై,
మంచివాడై, అమ్మాయికి నచ్చితే చాలు! ఆ వివరాలన్నీ చాలా బాగా నచ్చాయి అతనికి. కాని ఒక్కటే- తను సుధకి కచ్చితంగా నచ్చుతాడుగాని, ఉద్యోగస్థుడు మాత్రం కాదు. ఐనా అదెంత సేపు- తలచుకుంటే చిటికెలో సంపాయిస్తాడు; సంపాదించి ఆమె తల్లిదండ్రుల వల్లని చూపు కూడా పొందేస్తాడు!

అక్కడి నుంచి ఆ ఇంటికి దూరంగా నించుని ఇల్లు కాపలా కాస్తూ ఇంకోవేపు ఉద్యోగ ప్రయత్నం చేస్తూ వెంకట సుబ్బారావు జీవితం వెళ్లబోస్తున్నాడు. కొడుకు ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాడని విని, తండ్రి సంబర పడిపోయి తనూ తిరగడం మొదలు పెట్టాడు.

వెంకట సుబ్బారావుకి ఉద్యోగం దొరికింది. ఉదయం తొమ్మిది నుంచి, సాయంకాలం ఐదు వరకూ ఉద్యోగం. జీతం ఆరు వందలు. దాదాపు ఐదున్నర నుంచి రాత్రి ఏడు వరకు సుధ ఇంటి ముందు రెండో వుద్యోగం. జీవితం దాదాపు ఆరు వేల సెకెండ్లు!

సుధతో ఓ చిక్కొచ్చి పడింది. సాయంకాలం వూట అంతగా బయటికి రాదు. రాదేమిటి, ఆ పాడు తల్లిదండ్రులే రానివ్వరుట. రాక్షసులు! స్వతంత్ర భారత దేశంలో ఒక పచ్చని అమ్మాయికి స్వేచ్ఛ ఇవ్వని జైలు వార్డర్లు! ఎప్పుడైనా రాదా, ఎలాగైనా రాదా- అని వెంకట సుబ్బారావు కావలాలు కాస్తూ పడిగాపులు పడుతూనే వున్నాడు!...

ఓ అందమైన సాయంత్రం ఆమె తల్లితో కలిసి పేరంటానికి కాబోలు, వెళ్లి తిరిగొస్తూ వుంటే వెంకట సుబ్బారావు చూశాడు. కళ్లూ ఒళ్లూ గిరిగిరా తిప్పుతూ చూశాడు. సుధ కూడా చూసింది. అతను తన కేసే చూస్తున్నాడని తెలిసి, మరి కొన్ని క్షణాలు చూసింది. కాని, వెంకట సుబ్బారావు నవ్విన వెర్రి నవ్వుకి మాత్రం సమాధానం ఇవ్వలేదు- వెళ్ళిపోయింది.

జీతంలో సగం డబ్బు పనిపిల్ల లంచానికే సరిపోయింది. ఎలాగైనా ఆమె ఫోటో సంపాయించి ఇమ్మన్నాడు. తనకి ఆమె ఫోటో కావాలని పనిపిల్ల అడిగితే, లేదందిట. 'ఏదో మిష పెట్టి తీయించలేదా' అని అడిగాడు. పనిపిల్లకి చిరాకు, విసుగూ కలిగినట్టు గ్రహించి తగ్గిపోయాడు.

ఇహ లాభంలేదని వెంకట సుబ్బారావు డ్యూటీని ఓవర్‌టైమ్‌కి పెంచాడు. ఉదయం వూట కూడా ఒక గంట డ్యూటీ చేస్తేగాని 'ఓవర్ టైమ్' పెరగడం లేదు. ఆ వేళలలో ఒక సారి డాబా మీద బట్టలు ఆరబెడుతూనో, జుట్టు ఆరబెట్టుకుంటూనో సుధ కనిపించేది. ఐతే- రోడ్డు మీద తిరుగుతున్న మహాజన సముద్రంలో అతనూ ఒక నీటి బిందువు అయిపోయాడు. సైగలు చెయ్యలేదు... తెగించి ఇంట్లోకి వెళ్లలేదు.

ఇహ ఇదీ లాభం లేదని- తెగించి ప్రేమ లేఖ రాశాడు. నే నివ్వనంది పనిపిల్ల. ఎలాగైనా అందజెయ్యమని బతిమాలి ఒక 'బోనస్' కొట్టించాడు- 'సరే' అని తీసుకువెళ్లి, ఎవరూ చూడకుండా సుధ చదువుకుంటున్న పుస్తకం మధ్య ఆ ఉత్తరం పెట్టి వెళ్లిపోయింది పనిపిల్ల. తర్వాత ఏమైందని ఆత్రుతగా అడిగాడు అతను. "ఈ

ఉత్తరం ఏమిటి- ఎలా వచ్చింది?' అని నన్ను అడిగింది. నాకేం తెలీదన్నాను" అంది పని పిల్ల.

"నే నిచ్చానని చెప్పలేదా?"

"నన్ను వెళ్లగొడతారో, చావగొడతారో మీకేం తెలుసు?"

"చదివిందా?"

"చదివే వుంటుంది"

"జవాబు?"

జవాబు లేదు.

"జవాబు?... ఉత్తరం భద్రంగా జాకెట్లో దాచిందా- చింపి పారేసిందా?"

"చింపడం చూశాను. పారేయడం చూడలేదు. రేపు ఇల్లు ఊడుస్తానుగా- ఆ కాగితం ముక్కలు దొరికితే మీకే తెచ్చి ఇచ్చేస్తాను. నాకెందుకు?"

వెంకట సుబ్బారావు నెత్తీ నోరు మొత్తుకున్నాడు.

ఇలా లేఖలు, రాయబారాలు, నిరీక్షణలూ, ఓవర్ టైమ్‌లూ లాభంలేదు... నేరుగా వెళ్లి ఆ తలిదండ్రుల్ని అడిగేస్తే విషయం తేలిపోతుంది. మూడు నెల్ల ముసుగులో గుద్దులాటకి ఇహ స్వస్తి చెప్పేయాలి!

ఓ సుముహూర్తంలో శ్రీ శ్రీ వెంకట సుబ్బారావు టీకు టాకుగా, ట్రిమ్‌గా, నీటుగా తయారై ఇంట్లో ప్రవేశించి, వయ్యారంగా నిలబడి, వినయంగా పిలిచాడు- "సార్" అని. సుధ తండ్రి వచ్చి, అతన్ని ఎగాదిగా చూస్తూ వుంటే అతను జంకలేదు, తొణకలేదు, బెణకలేదు. యోగ సాధకుడిలా ఊపిరి మొత్తం బిగించి మాట్లాడేశాడు.



"సుధారాణిగారి తండ్రిగారు మీరేనా?"

"అవును. ఏంకావాలి?"

"నా పేరు వెంకట సుబ్బారావు?"

"ఐతే?"

"మీకు కులం పట్టింపు లేదని, అబ్బాయి ఉద్యోగస్థుడై అమ్మాయికి నచ్చితే చాలని విన్నాను. నన్ను మీ అమ్మాయి చూసింది. నచ్చినట్టే వున్నాను. ఉద్యోగస్తుడిని. కనుక, ఆమెను నాకిచ్చి ఏ తత్శుభముహూర్తంలో వివాహం చెయ్యగోరుతున్నాను."

సుధ తండ్రి పిచ్చివాడిని చూసినట్టు చూసి, వెర్రివాడై ఎర్రబారి, తర్వాత తెల్లబడి, ఓ క్షణం తర్వాత చల్లబడ్డాడు.

"మా సుధకి పెళ్లి నిశ్చయమైంది. శుభలేఖలు అచ్చుకాగానే నీకొకటి పంపిస్తాను- అడ్రసియ్యి" అన్నాడు తండ్రి గంభీరంగా. వెంకట సుబ్బారావుకి దిమ్మ తిరిగి పోయింది. కాళ్ల కింద వున్న బూట్లు టకటకలాడాయి; బూట్ల కింద వున్న నున్నటి గచ్చు గజగజలాడింది...

"ని... ని... నిజమా!" అన్నాయి వెంకట సుబ్బారావు పెదవులు అల్లల్లాడిపోతూ.

"నిజం!" అన్నాయి సుధ తండ్రి కళ్లు ఎర్రగా తిరుగుతూ.

మరుక్షణంలో వెంకటసుబ్బారావు రోజూ తను నించునే పేవ్‌మెంటు మీద వున్నాడు. దిక్కుతోచక, దారీ తెన్నూ తెలియక అయోమయంగా జుట్టుపీక్కుంటూ వుంటే, బాటసారి ఒకడు దువ్వెన ఇచ్చి, రోడ్డు దాటించాడు.

ఆనాటి నుంచి వెంకటసుబ్బారావుకి తిండి, నిద్రా దూరమైనాయి. "ఎవడు వాడు? ఎవడా పెళ్లి కొడుకు? ధూర్తుడు! దుష్టుడు! వాడితో నా సుధకి పెళ్లా! ఓ భగవంతుడా! ఈ పెళ్లి తప్పించలేవా?" అని అరవడం మొదలుపెట్టాడు. గజేంద్రుడి మొర వినిపించినట్టు వెంకటసుబ్బారావు మొర ఆ భగవంతుడికి వినిపించలేదు.

పని మనిషి ద్వారా ఆ పెళ్లి కొడుకు వివరాలు తెలుసుకొని పెళ్లి తప్పించాలని ప్రయత్నం చేశాడు- ఓ రోజు.

"సుధని మీరు పెళ్లి చేసుకోబోతున్నారా! పాపం! ఆ పిల్ల మంచిది కాదు. ఓసారి రౌడీలు శీలం చెడగొట్టారు; అప్పట్నుంచి తనే చెడగొట్టుకుంటోంది. పైగా, క్షయవ్యాధి, డైబటీసూ, బి.పి., వీడీలూ, కాన్సరు, ఎయిడ్స్ అన్నీ వున్నాయి. మీ వంటి పెద్దమనిషికి ఈ నీచపు సంబంధం ఎలా అంటగట్టారో అర్థం కాలేదు. మీ మేలు కోరేవాడిగా చెబుతున్నాను. దయచేసి ఈ పెళ్లి రద్దు చేసుకోండి" అని వెంకట సుబ్బారావు పెళ్లి కొడుకుని ఏకాంతంగా కలిసి మారిపోశాడు.

"మీ పేరేనా వెంకట సుబ్బారావు?" అని అడిగాడు పెళ్లికొడుకు అంతా విని.

"అవును. మీకు... నే... నే...నేను తెలుసా..."

"తెలుసు. మీరు ఆ అమ్మాయిని మీకిచ్చి పెళ్లి చేయ్యమని ఒకరోజు అకస్మాత్తుగా వెళ్లి అడిగారటగా- ఆయన నాతో చెప్పాడు" అన్నాడు కూల్‌గా పెళ్లికొడుకు.

వెంకటసుబ్బారావు కాలిబూట్లు ఈసారి కిటకిటలాడాయి. తర్వాత టకటక లాడుతూ 'గరిష్ఠవేగము'తో రోడ్డుమీదికి పారిపోయాయి. అయినా అతను సుధను మరిచిపోదలచుకోలేదు. ఆఖరి నిమిషంలోనైనా పెళ్లి చెడిపోక పోతుందా, తను ఘట్టన పెళ్లి పీటల మీద కూచోకపోతునా— అని ఆశ పడుతూనే వున్నాడు... ఓ సూర్యాస్తమయ సమయంలో పనిపిల్ల 'శుభలేఖ' తెచ్చి ఇచ్చింది. అది చూస్తూ, వెంకట సుబ్బారావు తన కన్నీళ్ళు ఆ అక్షరాల మీద పడేలా దగ్గరగా పెట్టుకొని రోదించాడు! అయిపోయింది! ఇక లాభం లేదు... సుధ తనికి దక్కదు... అయినా తను సుధని మరిచిపోలేడు... సుధ లేకుండా తను బతకలేడు కనుక, తనకి ఆత్మహత్యే శరణ్యం!

ఆ రోజే సుధకి పెళ్లి. సుధ, తన మెడలో ఆ పర పురుషుడి చేత తాళి కట్టించుకునే, అదే ముహూర్తంలో తన మెడలో యమ కింకరుల ఉచ్చుపడాలి. ఆ ఉచ్చు పడడం కోసమే అతను 'ఉచ్చు' కోసం వేట ఆరంభించాడు... ఎలా చావాలి, ఏ మార్గాన్ని అన్వేషించాలి- అన్న విషయం తర్జనభర్జనలో వుంది.

రాత్రి సరిగా పదకొండు గంటల ఇరవై ఏడు నిమిషాల వరకు తనకి టైముంది. ఆలోగా ఏదో ఒక ఆధారం దొరక్కపోదు.

కోపంతో ఏడుస్తున్న వెంకటసుబ్బారావుకి సుధని పెళ్లి కూతురు అలంకారాల్లో చూడాలనీ ఆ దివ్యమంగళ రూపం ఒక్కసారి చూసి తను తనువు చాలించాలనీ ఆశ కలిగింది. పెళ్లి కూతుర్ని పీటల మీదికి తీసుకొచ్చే వేళకి- వెంకట సుబ్బారావు మంటపం వైపు వెళ్లి దూరంగా నించున్నాడు. తను ఇక్కడి నుంచే సుధను చూసుకోవాలి. దగ్గరికెళ్తే భరించలేడు.మంటపం రంగురంగుల దీపాలతోమెరిసిపోతూ, దివ్యంగా కనిపిస్తోంది. లోపల అంతా సందడిగా వుంది. కాని జాగ్రత్తగా చూస్తే, ఆ సందడేదో గంద్రగోళపు సందడిలా వుంది! వెంకటసుబ్బారావు కొన్ని అడుగులు ముందుకు నడిచి, నిదానించి చూశాడు... కొందరు గాభరాగా తిరుగుతున్నారు. కొందరు కూలబడినట్టు కూచున్నారు. కొందరు ఏడుస్తున్నట్టున్నారు... పోలీసులు కూడా కనిపిస్తున్నారు...

వెంకటసుబ్బారావుకి కాళ్లు గడగడ వణికాయి. ఏమైంది?... ఏం జరిగింది?... తనుఊహించినట్టు ఆ దుర్మార్గపు పెళ్లికొడుకు ఆఖరి నిమిషంలో పేచీ పెట్టాడా!...

వెంకటసుబ్బారావు మంటపం గేటు వరకు వెళ్లి అక్కడ నిలబడి మాట్లాడు కుంటున్న వాళ్లని "ఏం జరిగిందండీ? పెళ్లి కొడుకు చేసుకోనన్నాడా?" అని అడిగాడు.

"అవును. చేసుకోనన్నాడు"

అతని కళ్ళు వెయ్యి దీపాల కాంతితో మెరిశాయి.

"జరగవలసిన పెళ్లి కూడా రద్దయింది" అన్నారు వాళ్లు.

"రద్దయిందా!" అతని ఆనందానికి అంతులేదు.

"అవును. పెళ్లికొడుకు కట్నం తీసుకోకుండా పెళ్లి చేసుకుంటానన్నాట్ట మొదట. తీరా ఓ గంట క్రితం పెద్ద పేచీ పెట్టి తనకి యాభై వేల రూపాయిల వరకు కట్నాలు ఇస్తాం అని సంబంధాలు వస్తున్నాయని, కనీసం నలభై వేలయినా ఇస్తేగాని పెళ్లి చేసుకోనని అన్నాట్ట. అమ్మాయి తండ్రి ఎక్కడ నుంచి తేగలడు? ఏం చెయ్యగలడు? "నేనేమీ ఇవ్వలేను" అని ఏడ్చాడు. "ఐతే ఈ పెళ్ళి నాకొద్దు" అని పెళ్ళి కొడుకు, అతని మనుషులు వెళ్ళిపోయారు. పెళ్లి రద్దయిందని అమ్మాయి తల్లిదండ్రులు అవమాన భారంతో క్రుంగిపోతూ వుంటే, అకస్మాత్తుగా జరిగిన ఈ సంఘటనకి తట్టుకోలేక పాపం, ఆ పెళ్లి కూతురు కట్టుకున్న కొత్త చీరనే మెడకు బిగించుకుని ప్రాణాలు తీసుకుంది... చాలా సెన్సిటివ్ గర్ల్!..."

"ప్రాణాలు తీసుకుందా... సుధ ఆత్మహత్య చేసుకుందా!" అని వెంకట సుబ్బారావు పెద్ద శ్రుతిలో అరిచి, అటూ ఇటూ పరుగెత్తాడు... పరుగెత్తి పరుగెత్తి అలిసిపోయి, ఒక చెట్టును ఆనుకుని తీవ్రమైన తర్జన భర్జనలో పడ్డాడు...

సుధ ఇంకొకడిని పెళ్లి చేసుకోవడం, వాడితో కాపురం చెయ్యడం చూడలేక తను ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. కాని... కాని... సుధే ఆత్మహత్య చేసుకుంది!... అసలు సుధే ఈ భూమ్మీద లేనప్పుడు... ఇప్పుడు... తను ఆత్మహత్యచేసుకోవలసిన అవసరం వుందా?... లేదా?... ఆ విషయం మీద వెంకట సుబ్బారావు తీవ్రమైన తర్జనభర్జనలో పడ్డాడు...

తను ప్రేమించిన సుధ మరణించినందుకు విచారించాలో, తనకు తిరిగి 'బ్రతుకు' ప్రసాదించినందుకు సంతోషించాలో తేల్చుకోలేక వెంకట సుబ్బారావు మళ్లీ తర్జన భర్జనలు మొదలుపెట్టి అడుగులో అడుగులు వేస్తున్నాడు!

## చలి

చలి
చలికి మరో పేరు పులి
పులి కాదంటే కరి
కరి కూడా కాదంటే ఆకలి...
చలి పులికి ఉలికి
తలుపులు మూసుకున్న పీడితులం మనం
చలి కరికి వెరచి
చేతులు కట్టుకుంటున్న బానిసలం మనం,
చలి ఆకలికి కాలి
చిక్కి నగ్నమైపోతున్న శ్రామికులం మనం...
చేతులు ముడుచుక్కూర్చుంటే
చలికి బలం పెరుగుతుంది,
చేతులు కలిపి కదులుతుంటే
చలికి గుండె అదురుతుంది...

బిగించే పిడికిలి
చలికి తగిలించే ఉరి
ధైర్యంగా తలెత్తే కళ్లు
చలిని బలితీసుకునే సెగళ్లు...

ఆత్మవిశ్వాసాన్ని
మన గుండెలమీద పదునుబెట్టుకుని
ఆయుధంగా ధరిద్దాం!
మత్తుదిగిన కరి
మన పాదాలకు మొక్కుతుంది

ఆశయాల్ని ఆలోచనల్ని
ఆచరణలో రగిల్చి
భవిష్యత్తు కాగడా వెలిగిద్దాం!
కళ్లు తిరిగిన పులి
దిగంతాలకు పరుగెత్తుతుంది

మాటల సైనికులకు శ్రమశిక్షణ నేర్పి
మొగమోటం భయాల్ని ఛేదించుకుని
సమైక్య ప్రభంజన ప్రవాహాలై పరాక్రమిస్తూ
నోళ్లు కొట్టే పొట్టలు లక్ష్యంగా గురిపెడదాం!
చలికి నియంత ఆకలి
చిరునామా లేకుండా అదృశ్యమై పోతుంది

మన నరాల్లో
ఎన్నో కాంతి హయాలు
మన కరాల్లో
అగణిత సూర్యోదయాలు
పనిచేసే మన వ్రేళ్లు
చలికి వేస్తాయి సంకెళ్లు
మట్టిలోని వేళ్లు
చెట్టుకు పోస్తాయి ప్రాణాలు.

—రావి రంగారావు